క్లుప్తంగా

నెల్లూరమ్మకు విశేష పూజలు



ఆలయం వద్ద భక్తులకు అన్నదానం



పూజలందుకున్న నెల్లూరమ్మ

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో వెలసిన నెల్లూరమ్మ, అంకాలమ్మ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ఆలయాలను నీటితో శుద్ధిచేసి అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. గ్రామానికి ఎలాంటి అరిష్టం రాకుండా కరుణచూపాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. గ్రామానికి చెందిన పార్థయ్యశెట్టి భక్తులకు అన్నదానం చేశారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



దౌల్తాపురం గ్రామంలో ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామంలోని ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో గ్రామ ప్రజలే కాక నంచర్ల గ్రామస్తులు, రెల్వే సిబ్బంది కూడా ఆదేదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఎద్దుల బండి, ట్రాక్టర్ వాహనాలపై నుంచి చేతికి తాకే ఎత్తులోనే తీగలు ఉన్నాయని, పలు మార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చురుగ్గా ట్యాంకు నిర్మాణ పనులు



చిప్పగిరిలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు

చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరిలో రూ.54 లక్షలతో లక్ష లీటర్ల సామర్థ్యంతో చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగతున్నాయి. గతంలో ఒకే ఓవర్ హెడ్ ట్యాంకు ఉండడంతో గ్రామంలోని ఎస్సీ, బీసీ, కొండా తదితర కాలనీలకు నీరు సక్రమంగా అందేదికాదు. ఈ ట్యాంకు నిర్మాణం పూర్తయితే గ్రామంలోని అనేక కాలనీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ విజేత ప్యాపిలి



బహుమతి అందుకుంటున్న ప్యాపిలి జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి జట్టు విజేతగా నిలిచినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 24 జట్లు పాల్గొనగా మొదటి స్థానంలో ప్యాపిలి జట్టు, రెండో స్థానంలో వెంకటాపురం, మూడో స్థానంలో బావిపల్లె జట్టు నిలిచినట్లు వెల్లడించారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ15వేలు, రూ.10వేలను అందజేశారు.

20 నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీ

దేవనకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో ఈనెల 20వ తేదీ నుంచి రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నట్లు ఏఓ సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలానికి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులకు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. క్వింటా వేరుశనగ పూర్తి ధర రూ.9500 ఉండగా, సబ్సిడీ 40 శాతం (రూ.3,800) పోను రైతు రూ.5700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఆధార్‌కార్డు, పాసు పుస్తకం, ఫోన్ నంబర్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అన్నదాతకు ఆర్థిక ఊరట

- వైఎస్సార్ పంటల బీమా విడుదల
- ఆలూరు నియోజకవర్గానికి రూ.99.68 కోట్లు మంజూరు
- 58,268 హెక్టార్లలో పంటలు సాగుచేసిన 62 వేల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



హొళగుంద ఎస్‌బీఐ వద్ద పరిహారం డబ్బు కోసం వచ్చిన రైతులు



ఆస్పరిలో స్టేట్ బ్యాంకు సీఎస్‌పీ కేంద్రాల వద్ద అన్నదాతలు

ఆలూరు రూరల్: ప్రకృతి చిన్న చూపు చూసింది. సరైన వర్షాలు లేక.. సాగుచేసిన పంటల దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారి ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంట బీమాతో ఆదుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి నెలలో పంట నష్టహారం మంజూరు చేస్తూ బటన్ నొక్కారు. ఈనెల మొదటి వారంలో నిధులు జమ కావాల్సి ఉండగా.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అడ్డుపడ్డారు. ఇన్సురెన్స్ నగదు మంజూరు చేయరాదని ఈసీకి ఫిర్యాదు చేయించారు. పోలింగ్ ముగియడంతో ప్రభుత్వం శనివారం పంట నష్టపరిహారాన్ని వారి ఖాతాలకు జమ చేసింది. దీంతో అన్నదాతకు ఎంతో ఊరట లభించింది.

రూ.99.68 కోట్ల లబ్ధి

పంటల బీమా పథకం కింద నియోజవర్గంలో 58,268 వేల హెక్టార్లకు సంబంధించి 62,967 మంది రైతులకు రూ.99.68 కోట్ల మేర లబ్ధి చేకూరింది. 2023 ఖరీఫ్‌లో ఉల్లి, పత్తి, మిరప, వేరుశనగ, జొన్న పంటలు సాగు చేసి ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులందరికీ పంటల బీమా సొమ్ము వారి ఖాతాల్లో జమ అయ్యాయి. పండించిన పంటను రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ పూర్తి చేస్తే చాలు.. రైతుల తరపున రాష్ట్ర ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి మరీ పంటల బీమా అందిస్తోంది.

వాతావరణ, దిగుబడి ఆధారిత బీమా

మండలంలో పత్తి పంటకు వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారిత పంటల బీమాకు నోటిఫై చేశారు. పత్తితో పాటు ఉల్లి, మిరప, వేరుశనగ, జొన్న పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం లెక్కించారు. ఒక్కోరైతుకు గరిష్టంగా పది ఎకరాల వరకు వైఎస్సార్ పంటల బీమా పరిహారం అందింది. అలాగే పంటకోత ప్రయోగాల్లో వచ్చిన ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకున్నారు.

రైతు వాటాను భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గతంలో పండించిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించే పరిస్థితి ఉండేది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వాతావరణ, దిగుబడి ఆధారిత పంటల బీమాలో కేంద్రం వాటాతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 5 శాతం ఉంటుంది. ఈ 5 శాతంలో రైతు 2 శాతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 1.5 శాతం చెల్లించాల్సి ఉంది. అయితే రైతులకు భారం కాకుడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. దీంతో రైతులకు కొంత మేర ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోగా.. ఈ క్రాప్ చేసుకున్న ప్రతి రైతుకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాల్లో సరిచూసుకోండి..

దేవనకొండ: మండలానికి పంట నష్టపరిహారం కింద రూ.37,42,88,690 మొత్తం 23,581 మంది రైతుల ఖాతాల్లో జమ అయినట్లు ఏఓ సురేష్ శనివారం తెలిపారు. రైతులు డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయో లేదో సరి చూసుకోవాలన్నారు.

హొళగుంద మండలానికి రూ. 14.67 కోట్లు మంజూరు

హొళగుంద: 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన పంటలకు సంబంధించిన పరిహారం ప్రభుత్వం విడుదల చేయడంతో శనివారం రైతు ఖాతాల్లో నిధులు వరదలా వచ్చి చేరుతున్నాయి. మండలంలో మిరపతో పాటు వర్షాదార పంటలైన పత్తి 8,556.16 హెక్టార్లలో, వేరుశనగ 45,4, జొన్న 30.27, పొద్దుతిరుగుడు 5.21, ఆముదం 6.08, కొర్ర 11.16, సజ్జ 2.66 హెక్టార్లలో పంటలు ఎండిపోవడంతో ప్రభుత్వం పరిహారాన్ని మంజూరు చేసింది. మండంలో 8,819 మంది రైతులు నష్టపోయిన 8,657.38 హెక్టార్ల పంటలకు రూ.14,67,08,805 మంజూరయ్యాయి. ఈ డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. ప్రభుత్వం పత్తి, మిరప, వేరుశనగ పంటలకు గాను హెక్టార్‌కు రూ.17 వేలు ప్రకారంగా, మిగిలిన పంటలకు రూ.8,500 గరిష్టంగా ఒక రైతుకు రెండు హెక్టార్లు (5 ఎకరాలు) వరకు పరిహారం అందించినట్లు ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు.

బ్యాంకుల వద్దకు రైతులు

ఆస్పరి: ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు శనివారం రైతుల ఖాతాల్లో జమకావడంతో రైతులు ఆస్పరిలోని స్టేట్ బ్యాంకు సీఎస్‌పీ కేంద్రాల వద్దకు భారీగా తరలి వచ్చి డబ్బులు తీసుకున్నారు. మండలంలో మొత్తం 16,613.5 హెక్టార్లలో పంట నష్టం జరిగగా, 16,570 మంది రైతులకు రూ. 26,96 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హాలహర్వి మండలంలో 4,171 మందికి లబ్ధి..

హాలహర్వి: మండలంలోని 4,171 మంది రైతుల ఖాతాల్లో రూ.6.24 కోట్లు నగదు పంట నష్టపరిహారం జమ అయినట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. రైతులు వెంటనే బ్యాంకులకు వెళ్లి డబ్బులు జమ అయ్యాయో లేదో చెక్ చేసుకోవాలని సూచించారు. మండలంలో మొత్తం 4,114 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, అందుకు పంట నష్టం డబ్బులు విడుదలయ్యాయని ఆయన చెప్పారు.

ఇదిలా ఉండగా పెద్దిరెడ్డి అనే రైతుకు రూ.34 వేలు నష్టపరిహారం జమ అయ్యాయని ఆనందం వ్యక్తం చేశాడు.

మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వేసి మాట నిలబెట్టుకున్నారు. గతేడాది ఖరీఫ్‌లో 5 ఎకరల్లో పత్తి పంట వేసి వర్షాలు సరిగా రాకపోవడంతో నష్టపోయా. పంట నష్టపోయినందుకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.30వేలు నా బ్యాంకు ఖాతాలో జమఅయ్యాయి. ఈడబ్బు ప్రస్తుతం వ్యయవసాయ పెట్టుబడులకు ఎంతో ఉపయోపడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– సుధాకర్, యాటకల్లు, ఆస్పరి మండలం

బీమాతో ప్రభుత్వం ఆదుకుంది



గతేడాది ఖరీఫ్‌లో నాకు ఉన్న 2 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. సకాలంలో వర్షాలు పడక పంట దిగుబడి రాలేదు. మా గ్రామానికి సంబంధించి ఆర్బీకేలో వ్యవసాయ శాఖ అసిస్టెంటుకు తెలియజేశాను. ఈ-క్రాప్ నమోదు చేశారు. ప్రభుత్వం పంట బీమా విడుదల చేసిందని తెలిసింది. ఆర్బీకేలో ఉంచిన అర్హుల జాబితాలో నా పేరు ఉంది. నాకు రూ.12,500 నగదు విడుదల అయ్యింది. నష్టపోయిన నన్ను ప్రభుత్వం ఆదుకుంది.

– లక్ష్మన్న, రైతు, నిట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం

ఆర్థికంగా ఊరట



నాకు ఉన్న 2 ఎకరాల పొలంలో ఉల్లి పంట వేశా. పంట దిగుబడి సరిగా రాలేదు. ఎకరాకు రూ. 10 వేల చొప్పున ఖర్చుచేసి నష్టపోయానని బాధపడ్డాను. తెచ్చిన అప్పు ఎలా తీర్చాలనుకున్నాను. పంట నష్టపోయిందని తెలుసుకున్న వ్యవసాయ అధికారులు మా పొలానికి వచ్చి వివరాలు తీసుకున్నారు. దీంతో నాకు పంట నష్టపరిహారం కింద రూ.13,200 వేలు మంజూరు అయ్యాయి. మాలాంటి రైతులకు ఆర్థికంగా ఆండగా ఉన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– నరసప్ప, కురుకుంద, ఆలూరు మండలం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం వృషభాలు

కృష్ణగిరి: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం అమకతాడు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా వృషభాలు విజేతగా నిలిచాయి. వివిధ జిల్లాల నుంచి 16 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఇందులో అనంతపురం జిల్లా సీకేపల్లె మండలం పుల్లేటిపల్లె గ్రామానికి చెందిన బచ్చల భాస్కరరెడ్డి వృషభాలు 4,397 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో ప్యాపిలికి చెందిన కృష్ణ, బంగి నాగరాజుకు చెందిన వృషభాలు 4,074 అడుగులు లాగాయి. అలాగే ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన సుధాకర్, ఏ.కొడూరుకు చెందిన చాగంటి నాగేశ్వరెడ్డి వృషభాలు ఉమ్మడిగా 4వేల అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన ఎస్.ఎస్.వీ ట్రేడర్స్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను అందజేశారు.

నేడు న్యూ కేటగిరి విభాగంలో పోటీలు

ఆదివారం న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలను అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9704458065, 7013564624 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా వాసవీ మాత జయంతి



ఆస్పరిలో కలశాలు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆస్పరి: మండలకేంద్రంలో కన్యకాపరమేశ్వరీ మాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజారి మల్లికార్జున ఆధ్వర్యంలో అమ్మ వారికి గణపతి, దుర్గ, నవగ్రహ హోమం, గంగ, కలశ పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతులు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కలశాలు, అమ్మవారి చిత్ర పటాన్ని, ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. మహిళలు లలితా సహస్ర నామ జపం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, మహేంద్ర, సూరయ్య, మాణిక్యాలు రఘు, పవన్, కౌశిక్, కిరణ్, సుధాకర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక నగిరేశ్వర దేవాలయంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా మద్దమ్మబావి నుంచి కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హొళగుందలో..

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో శనివారం ఆర్యవైశ్యులు శ్రీవాసవి కన్యాకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా వాసవీ మాత చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పెద్ద బావి వద్ద గంగి పూజా అనంతరం కుంభోత్సవం, అభిషేకాలు, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేసారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకలు కృష్ణమూర్తిశెట్టి, శ్రీధర్ శెట్టి, సత్యనారాయణశెట్టి, శివాశెట్టి, పద్మనాభశెట్టి, నాగరాజు శెట్టి, ప్రహ్లాదశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పరిలో పూజలందుకున్న వాసవీ మాత

ఆలూరులో వాసవి జయంతి వేడుకలు

ఆలూరు : కర్నూలు-బళ్లారి రోడ్డు సమీపంలోని వాసవీ మాత దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హొళగుందలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



మద్దికెరలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



హైదరాబాదులో చికిత్స పొందుతున్న కేశవరెడ్డిని పరామర్శిస్తున్న బుసినె విరూపాక్షి

ఆస్పరి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సొసైటీ చైర్మన్ కేశవ రెడ్డి ఈనెల 7న శంకరబండ బస్టాప్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి హైదరాబాదు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న కేశవరెడ్డిని పరామర్శించారు. త్వరగా కొలుకునేలా చికిత్స చేయాలని డాక్టర్లకు సూచించారు. తన వంతుగా కేశవరెడ్డికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఆస్పరి, ఆలూరు జెడ్పీటీసీ సభ్యులు దొరబాబు, ఏరూరు శేఖర్, జనార్దన్, భార్గవ్, రంగనాథ్, ఈరన్న ఉన్నారు.

పిల్లల ఆరోగ్య పరిరక్షణలో టీకాల పాత్ర కీలకం

కర్నూలు (టౌన్): తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో టీకాల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఇందిరా గాంధీ నగర్‌లోని 1 వ సచివాలయంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. రక్తహీనతతో బాధపడకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను ప్రతి రోజు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అనంతరం సిబ్బంది టీకాలు అందిస్తున్న తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగస్వామ్య రెడ్డి, జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

వైభవం.. వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

పత్తికొండ రూరల్: పత్తికొండ పాతపేటలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అర్చకులు బ్రహ్మయ్యాచారి, శరభయ్యాచారి స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శంకరయ్యాచారి, కాలయ్యాచారి, పరమేష్ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

మద్దికెర: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కాలజ్ఞానం వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పంట నష్టపరిహారం జమ

కృష్ణగిరి: గత ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పంట నష్ట పరిహారం శనివారం ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు జమైనట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో వివిధ పంటలు సాగు చేసి రైతులు నష్టపోయారని చెప్పారు. మొత్తం 19,697 మంది రైతులు 15,887 హెక్టార్లలో పంట నష్ట పోగా వీరికి ప్రభుత్వం రూ.21,56,60,785 పరిహారంగా చెల్లించిందని తెలిపారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణగిరికి 110 టన్నుల విత్తనాలు



మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు మండలానికి ప్రస్తుతం 110 టన్నుల వేరుశనగ విత్తనాలు కేటాయించినట్లు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వీఏఏ, వీహెచ్ఏలతో ఖరీఫ్ సాగుపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఈ నెల 20వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్వింటాల్ రూ.9,500గా నిర్ణయించామని తెలిపారు. ఇందులో రాయితీ రూ.3,800 (40 శాతం) పోను రైతు వాటా కింద రూ.5,700 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఒక రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు ఇస్తామన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి రసాయన ఎరువుల కొరత లేకుండా అవసరమైన స్టాక్ కోసం కియోస్క్ మిషన్ ద్వారా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో ఉన్నాయని.. అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు అందించాలన్నారు.

వేసవి దుక్కులతో ఎంతో మేలు

మద్దికెర: వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వర్షం పడినప్పుడు భూమిలో ఇంకిపోయి పొలాలు సారవంతంగా మారుతాయని ఏఓ రవి అన్నారు. శనివారం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో గత వారం నుంచి 9.6 సెం.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. వేసవి దుక్కులు చేయడం ద్వారా నేల పొరల్లో ఉన్న కీటకాలు ఎండబారిన పడి నశిస్తాయన్నారు. గడ్డి మొక్కలైన తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పూర్తిగా నివారించుకోవచ్చన్నారు. మొట్ట పొలాలకు వీలైనంత పశువుల ఎరువులను వేసుకుని కలియదున్నడం వల్ల వర్షపునీరు ఇంకి సేంద్రియ కర్బనం పెరిగి నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. ఎకరాకు రెండు ట్రాక్టర్ల ఎరువును వేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆలూరు: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సర్పంచ్‌లు, పీఎస్‌లు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. శనివారం హాలహర్వి, మండలంలోని బాపురం గ్రామం రిజర్వాయర్ నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ.. ఆలూరు, చిప్పగిరి, పెద్ద హోతూరు, మొలగవెల్లి, జొహరాపురం, హుశేబీడు, ఎం.కొట్టాల గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు.